## దరఖాస్తుల స్వీకరణ

షాద్‌నగర్‌రూరల్, మార్చి 21 : తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ విద్యాలయాల్లో 2021-25 సంవత్సరానికి బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కమ్మదనం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5నుంచి 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు 6 నుంచి 9వ తరగతి ప్రవేశం పొందేందుకు ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులుగా తెలిపారు. ప్రవేశ పరీక్ష రాసేందుకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ WWW.tswreis.ac.in or tgtwgurkulam. telangana. gov.in ద్వారా దరఖాస్తులను చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 21 : స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ రంగారెడ్డిజిల్లా కార్యదర్శి జగన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులతో పాటు విద్యార్థులు, విద్యార్థిసంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. డ్రగ్స్ నిర్మూళనపై అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## అప్రమత్తంగా ఉండాలి

పోతుగల్ తండాలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, మార్చి 21: పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని నాగరగూడ, పోతుగల్ తండా గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పశువు అనారోగ్యానికి గురైన వెంటనే తమకు సమాచారం అందించాలని చెప్పారు. గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది కృష్ణయ్య, శ్రీను, నరేశ్ పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కడ్తాల్: సాలార్‌పూర్ గ్రామంలో మహిళలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

కడ్తాల్, మార్చి 21: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. గురువారం మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షంలో భాగంగా, సీమంతాలు, చిన్నారులకు అన్నప్రసాన, చిరుధాన్యాల ప్రాముఖ్యత, రక్తహీనత నివారించుట గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాలతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని మహిళలు తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో పోషకాలు పుష్కలంగా లభిస్తాయని, మహిళలు, బాలింతలు, రక్తహీనత ఉన్న వారు వాటిని తీసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఏ ఊరిలోనూ పోషకలోపం ఉండకూడదనే ఉద్దేశంతో మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చరిత, అంగన్‌వాడీ టీచర్లు అంజమ్మ, సంగీత, శోభారాణి, ఆశాలు స్వరూప, లక్ష్మి, అనురూప, పాల్గొన్నారు.

ఆమనగల్లు : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని విఠాయిపల్లి, శంకర్‌కొండతండాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా (పోషణ పక్షం) కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి సూపర్‌వైజర్ పార్వతి హాజరై మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని బాలింతలు, గర్భిణులు తీసుకోవాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధమ్మ, జయమ్మ, సుజాత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ప్రతిజ్ఞ చేయిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి

సోమలింగేశ్వరస్వామి కల్యాణాన్ని జరిపిస్తున్న అర్చకులు

## వైభవంగా సోమలింగేశ్వరుడి కల్యాణం

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21 : మండలంలోని చిన్నరావిరాల గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న మాణిక్యాంబ సమేత సోమలింగేశ్వరస్వామి సప్తదశ 17వ వార్షిక కల్యాణ రథోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధ వారం రాత్రి స్వామివారి కల్యాణాన్ని ఎంపీటీసీ అనితామహేందర్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్ ఆధ్వర్యంలో పురోహితులు మాడ్గుల నారాయణశర్మ కనుల పండువగా జరిపించారు. స్వామివారికి అనితామహేందర్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. తెల్లవారుజామున అగ్నిగుండాలు, రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వనజాశ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్, నాయకులు మహేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, బసవయ్య, కిషన్‌గౌడ్, లింగారెడ్డి, సత్యనారాయణ, భాస్కర్, శేఖర్‌రెడ్డి, లింగారెడ్డి, గ్రామస్తులు పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రక్తదానాన్ని అలవాటుగా మార్చుకోవాలి

మొయినాబాద్, మార్చి 21 : ప్రతి పౌరుడు రక్తదానం చేయడాన్ని అలవాటుగా మార్చుకోవాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిలుకూరులోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అరిస్టాటిల్ పీజీ కళాశాల, కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, ఎన్ఎస్ఎస్ విభాగం, లైయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ వారు సంయుక్తంగా గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో పలువురు పాల్గొని 72 యూనిట్లు రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో కేసీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, అధ్యాపకురాలు ఉదయశ్రీ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మల్లారెడ్డి, టి.రమేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు డబుల్ బెడ్రూంలు ఇవ్వండి

ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న గోవర్ధన్ తదితరులు

పెద్దఅంబర్‌పేట, మార్చి 21: మండలంలోని దివ్యాంగులకు డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు చెలిమండ్ల గోవర్ధన్ కోరారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ.. అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ పరిధిలో అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయాంజాల్ మున్సిపాలిటీ, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీలు ఉన్నాయని, వాటి పరిధిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో దివ్యాంగులకు కూడా కోటా కేటాయిస్తామని గత ప్రభుత్వం తెలిపిందని చెప్పారు. ఈ మేరకు గతంలోనే జీవో సైతం వచ్చిందన్నారు. దాని ప్రకారం దివ్యాంగులకు డబుల్ బెడ్రూంలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో బాలస్వామి, దేవీశ్రీ ప్రసాద్, మల్లెపాక మల్లేశ్, షబ్బీర్, రాంనర్సయ్య, భద్రయ్య, రమేశ్, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల అభివృద్ధికి కృషి

మల్లన్న దేవాలయం నిర్మాణానికి రూ.3లక్షలు అందజేస్తున్న జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి

షాబాద్, మార్చి 21: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని షాబాద్ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని సాయిరెడ్డిగూడ మల్లన్న ఆలయంలో పార్టీ శ్రేణులతో కలిసి పూజలు చేశారు. అనంతరం ఆలయం నిర్మాణానికి రూ.3లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం గ్రామస్తులు జడ్పీటీసీని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ...ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నర్సింహారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ లచ్చనోళ్ల సులోచన, బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, గోపాల్ తదితరులున్నారు.

**షాద్‌నగర్‌రూరల్ :** మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణ పనుల కోసం ఫరూఖ్‌నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామ మాజీ సర్పంచ్ సాయిప్రసాద్ రూ.25వేలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

## మత్స్య పారిశ్రామిక సంఘం కార్యవర్గం ఎన్నిక

మొయినాబాద్ : నూతనంగా ఎన్నికైన సంఘం కమిటీ సభ్యులు

మొయినాబాద్, మార్చి 21 : పెద్దమంగళారం మత్స్య పారిశ్రామిక సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. మత్స్య శాఖ అధికారిణి శాలిని ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. తొమ్మిది మందితో ఏర్పాటైన కార్యవర్గం లో అధ్యక్షుడిగా పొన్న ప్రభాకర్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా మేకగూడం మల్లేశ్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా మేకగూడం శ్రీనివాస్‌ముదిరాజ్, కోశాధికారిగా అనిమోని నాగభూషణం ముదిరాజ్, సభ్యులుగా నరసింహ, పొన్న సుదర్శన్ ముదిరాజ్, మేకగూడం నరేంద్రముదిరాజ్, మేకగూడం నరసింహ ముదిరాజ్, మేకగూడం నరేందర్‌ముదిరాజ్ పాల్గొన్నారు

**మత్స్య పారిశ్రమ అభివృద్ధికి కృషి**

మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. మండలంలోని బాకారం గ్రామానికి చెందిన మహేందర్‌ముదిరాజ్ గురువారం సాయికుమార్ ను కలిసి అభినందనలు తెలిపి మత్స్యకారుల అబివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశాడు.

**సంఘం అధ్యక్షుడిగా యాదయ్య**

నందిగామ : నందిగామ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన గడ్డమీది యాదయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రవికుమార్, కారద్యర్శిగా ఈట మల్లేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను గురువారం జడ్పీ వైస్ చైర్మన్ గణేశ్ సన్మానించారు. మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శ్రీకాంత్, రమేశ్, శివకుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## మైసమ్మతల్లి సన్నిధిలో జడ్పీ చైర్‌పర్సన్ పూజలు

కడ్తాల్, మార్చి 21 : మైసిగండి మైసమ్మతల్లి ఆలయంలో గురువారం జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఆమె వెంట జడ్పీటీసీ దశరథ్‌నాయక్, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షుడు వీరయ్య, ఆలయ సిబ్బంది యాదగిరిస్వామి, బోడియానాయక్, కృష్ణ, రాము లు, చంద్రయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

## పోషకాహారంతో గర్భిణులు, బాలింతలకు మేలు

గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు

చేవెళ్లరూరల్, మార్చి 21 : పోషకాహారం తీసుకోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ అనురాధ అన్నారు. చేవెళ్ల మండలంలోని దామరగిద్ద గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసం వారోత్సవాల సందర్భంగా పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ మాట్లాడుతూ.. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతారని, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు సమపాళ్లలో తీసుకోవాలని, దీంతో రక్తహీనత లేకుండా సుఖ ప్రసవం జరుగుతుందన్నారు. పుట్టిన పిల్లలకు తల్లిపాలే శ్రేష్ఠమని, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సుజాత, పంచాయతీ కార్యదర్శి, కమ్మెట సెక్టర్ అంగన్‌వాడీలు, గర్భిణులు పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ

వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చేవెళ్లటౌన్, మార్చి 21: స్వతంత్ర సమరయోధులను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని చేవెళ్ల పీడీఎస్‌యూ నాయకులు తెలిపారు. గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతి సభల వాల్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులను స్మరించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పీడీఎస్‌యూ నాయకులు ఉన్నారు.

## కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు

చేవెళ్ల రూరల్, మార్చి 21 : కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. సీఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి దామగిద్ద గ్రామానికి చెందిన పోతురాజు మల్లేశ్ (34)ను మల్కాపూర్ గ్రామానికి చెందిన వడ్ల నందాచారి ఇద్దరి మధ్య డబ్బుల విషయమై ఈనెల 19వ తేదీ మంగళవారం రాత్రి ఫోన్‌లో వాగ్వాదం జరిగిందని, దీంతో నందాచారి పోతురాజు మల్లేశ్‌ను ఎస్సీ కులం వాడివని దూషించాడని తెలిపారు. బాధితుడు పోతురాజు మల్లేశ్ ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మారెడ్డి తెలిపారు.

# ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

కందుకూరులో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ఆర్డీవో సూరజ్ కుమార్

- ఆర్డీవో సూరజ్ కుమార్

కందుకూరు. మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడానికి కృషి చేయాలని నియోజకవర్గం ఎన్నికల అధికారి కందుకూరు ఆర్డీవో సూరజ్ కుమార్ తెలిపారు. మండల పరిషత్ సమావేశం హాల్‌లో గురువారం సెక్టోరల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని వారికి అవగాహన కల్పించారు. ప్రతి సెక్టోరల్ అధికారి తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను సందర్శించి కనీస వసతులను కల్పించడానికి కృషి చేయాలని కోరారు. ఓటర్లతో మాట్లాడి పోలింగ్ సమయంలో ఎదుర్కొనే సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని కోరారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రతి ఒక్కరికీ వర్తిస్తుందని తెలిపారు.స్వేచ్ఛగా న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలని సూచించారు.బాధ్యతాయుతంగా పని చేయాలని పేర్కొన్నారు. మహేశ్వరం అడిషనల్ డీసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నామన్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను చేసినట్లు వివరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ సమయంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. నియోజవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మహేశ్వరం డివిజన్ ఏసీపీ లక్ష్మీకాంత్‌రెడ్డి, కందుకూరు, బాలాపూరు తహసీల్దార్‌లు గోపాల్, మాధవిరెడ్డి, నాయబ్ తహసీల్దార్ శేఖర్, కందుకూరు,మహేశ్వరం మండలాల ఎంపీడీవోలు సరిత, శైలజ సెక్టోరల్ అధికారులు, సీఐలు ఎస్సై పాల్గొన్నారు.

# పరిసరాల శుభ్రతకు కృషి చేయాలి

కాలనీలో పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21 : పరిసరాల శుభ్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సురక్ష సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపీశంకర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన నూతన చెత్తబండిని కాలనీ వాసులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీశంకర్ మాట్లాడుతూ కొన్ని ఏండ్లుగా కాలనీలో పారిశుధ్య సమస్య తీవ్రంగా ఉండేదన్నారు. 11వేల జనాభా కలిగిన గృహ సముదాయంలో చెత్త సేకరించే వ్యవస్థలేక ప్రజలు రోడ్ల పైనే చెత్త వేసేవారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామపంచాయతీ వెంటనే ప్రక్షాళన మొదలు పెట్టిందన్నారు. కాలనీ వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న చెత్త డంపింగ్‌ను పారిశుధ్య కార్మికులు శుభ్రంచేసి నూతన చెత్తబండిని ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో సురక్ష సేవా సంఘం కార్యదర్శి కస్తూరి రమేశ్, సలహాదారులు నాగవల్లి యాదగిరి, సభ్యులు యాకూబ్, నర్సింహ, ప్రభాకర్, మున్న, సత్యనారాయణ, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

## వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ చేయూత

మన్సూరాబాద్, మార్చి 21: ఇరవై ఐదు సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు ఉప్పల ఫౌండేషన్ సంస్థ ద్వారా చేయూతనిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తెలిపారు. సికింద్రాబాద్‌కు చెందిన రుచికా, నల్గొండ జిల్లా అంతంపేటకు చెందిన మల్లేశ్వరి, నాగోల్, బండ్లగూడకు చెందిన శ్రావణి, వరంగల్, జనగాంకు చెందిన మౌనిక వివాహాలు ఇటీవల నిశ్చయమయ్యాయి. నాలుగు కుటుంబాల ఆర్థిక పరిస్థితిపై కొందరు సన్నిహితులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నిరుపేద కుటుంబాల్లో జరుగుతున్న వివాహాలకు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. నాగోల్, కోఆపరేటివ్ బ్యాంకు కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాలుగు కుటుంబాలకు చెందిన పెండ్లి కూతుర్లకు పుస్తె, మట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోటగిరి చంద్రశేఖర్, సునీత, యాదయ్య, స్వరూప, మల్లేశ్, వెంకటేశ్, చంద్రశేఖర్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కుర్మిద్దలో ఉచితంగా వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

యాచారం, మార్చి 21 : మండలంలోని కుర్మిద్ద గ్రామంలో గురువారం హైదరాబాద్‌కు చెందిన కామినేని దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్యులు గ్రామస్తులకు అన్ని రకాల వైద్య పరీక్షలను నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యువజ్యోతి ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కామినేని దవాఖాన ప్రతినిధి దేవేందర్, గ్రామస్తులు, సిబ్బంది తదితరులున్నారు.

## ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నార్లకొండ మల్లమ్మ

నార్లకొండ మల్లమ్మ

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 21 : బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నార్లకొండ మల్లమ్మ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా సహకార సంఘం అధికారిణి ధాత్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 8న 12 మంది డైరక్టర్లకు గాను 9 మంది డైరెక్టర్లు వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ, డైరెక్టర్లు చేగూరి భరత్‌కుమార్‌యాదవ్, చింతల లక్ష్మమ్మ, మొగుళ్ల చిన్నయాదిరెడ్డి, బిజిలి బాలనర్సింహ, గంట శ్రీనివాస్‌రెడ్డి, ఇటికల మహేందర్‌రెడ్డి, కొత్త పల్లి జైపాల్‌రెడ్డి, మేకల రాములు చైర్మన్ విఠల్‌రెడ్డి పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 28న నిర్వహించిన బలపరీక్షలో మెజార్టీ 9 మంది డైరెక్టర్లు పాల్గొన్నారు. కాగా అవిశ్వాసం పారదర్శకంగా జరుగలేదని చైర్మన్ విఠల్‌రెడ్డి హైకోర్టు నుంచి స్టే తీసుకురావడంతో అవిశ్వాస బలపరీక్ష పై జిల్లా సహకార సంఘం అధికారులు ఎలాంటి ప్రకటన చేయకుండా నేరుగా హైకోర్టుకు సీల్డ్ కవర్‌లో పంపించారు. విఠల్‌రెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తూ మెజార్టీ 9మంది డైరెక్టర్లకు అనుకూలంగా ఫలితాలు రావడంతో చైర్మన్ విఠల్‌రెడ్డి పదవి కోల్పోయారు. దీంతో వైస్ చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మ ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా సహకార సంఘం అధికారి అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చైర్మన్ ఎన్నిక జరిగే వరకు మల్లమ్మనే చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## మట్టికుప్పలు తొలగింపు

ఎల్బీనగర్ , మార్చి 21: రోడ్డుపై పేరుకుపోయిన మట్టికుప్పలు, అభివృద్ధి పనుల సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు స్పెషల్ డ్రైవ్‌తో మట్టి దిబ్బలు, డెబ్రీస్‌ను పూర్తిగా తొలగించారు. కొత్తపేట గాయత్రీపురం చౌరస్తా నుంచి నాగేశ్వర్‌రావు కాలనీ, ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యనగర్ కాలనీల రోడ్డులో మట్టికుప్పలను పూర్తిగా తొలగించారు. ఈ పనులను కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న బాక్స్ డ్రెయిన్ పనులను కూడా పూర్తి చేయాలని ఆయన అధికారులను కోరారు.